# షా

గుప్పిటితో గుండెను గట్టిగా నొక్కి పట్టినట్లనిపించేసరికి లేచి కూర్చున్నాను. దుప్పటి తీసి పక్కనపెట్టాను. సాయంత్రం డాక్టరు దగ్గరకు వెళ్లినప్పుడు అసౌకర్యంగా ఉందికాని ఇంత నొప్పిలేదు. ఆయన పరీక్ష చేసి, "ఇది గేస్ వలన వస్తోంది. గాభరా పడనవసరంలేదు" అని మందులురాసి ఇచ్చాడు. రాసిన మందులు కొని వేసుకున్నాక ఉపశమనం కలిగింది. మళ్లీ ఇప్పుడు నొప్పి మొదలయింది. చిన్నప్పుడొకసారి సైకిలు మీంచి పడినప్పుడు ఒకసారి వచ్చింది. అప్పుడేం మందులు వాడారో నాకు గుర్తులేదు. తగ్గిపోయింది. ఇవేళ మళ్లీ మొదలయింది. క్రమంగా ఎక్కువవుతోంది. తగ్గేట్టు లేదు. మా వాళ్లకు దూరంగా దిక్కులేకుండా చనిపోతానా?

మనసు చికాకుగా ఉంది. తెరిచి ఉన్న కిటికీలోంచి వీచే చల్లటి గాలికి మనసులో శాంతి నిలవటంలేదు. సమయం ఎంతయి ఉంటుందో తెలియటంలేదు. అర్ధరాత్రి దాటి ఉండొచ్చు. గదిలో బెడ్‌లైట్ నీలంగా వెలుగుతోంది. బల్ల మీదున్న సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె అందుకుని, సిగరెట్ తీసి పెదాల మధ్య పెట్టుకుని అగ్గిపుల్ల వెలిగించాను. సిగరెట్ ముట్టించాను. సిగరెట్లు తాగొద్దని డాక్టరు మరీమరీ చెప్పాడు. సిగరెట్ కిటికీలోంచి బయటకు విసిరాను. దగ్గు పొరలు పొరలుగా వచ్చింది. ఆ దగ్గులో గుండె ఆగిపోతే బావుండు అనిపించింది. కమల ఉసురు తేలికగా పోదు. నాకు తప్పకుండా తగులుతుంది.

మంచం మీద పడుకుని దుప్పటి మీదకు లాక్కున్నాను. ఊపిరి బిగుసుకున్నట్లు అనిపించింది. లేచి కూర్చున్నాను. లాభంలేదు. నాకు నిద్ర పట్టదు. పడుకుంటే ఊపిరాడదు. గుండె నొప్పి తగ్గినట్టే తగ్గి ఎక్కువవుతోంది. నరకం లాటి ఉసురు.

లేచి మంచందిగి గది మూలకు నడిచి కూజాలోంచి గ్లాసులోకి నీళ్లు వొంపుకుని తాగాను. మధ్యాహ్నం చేసిన భోజనానికో మందుల ప్రభావానికో కడుపు ఉబ్బరంగా ఉండి రాత్రి భోజనం చేయబుద్ధి కాలేదు. నీరసంగా ఉంది. గ్లాసు కూడా మీద మూతలాపెట్టి గోడకానుకుని నిలబడి కిటికీలోంచి బయటకు చూశాను. చీకటి నిశ్శబ్దంగా, చిక్కగా ఉంది. కమల జుట్టు పొడుగ్గా నల్లగా చిక్కటి చీకట్లా ఉండేది. కొబ్బరి ఆకులు గాలికి డాబా పిట్ట గోడ ఎక్కటానికి ప్రయత్నిస్తున్నాయి. రైలు కూత పావు నిమిషం పాటు వినిపించి నిశ్శబ్దంలో కలిసిపోయింది.

స్విచ్ బోర్డు దగ్గిరకు వచ్చి బెడ్‌లైటు ఆర్పేశాను. గోడకు, అలా ఆనుకుని నిలబడితే నొప్పి తగ్గినట్టు అనిపించింది. గోడ వీపుకు చల్లగా తగులుతోంది. నేను అనుకున్నవి ఎప్పుడూ సాధించలేక పోయాను. ఏ అవరోధాన్ని అధిగమించలేక పోయాను. బలహీనతకాదు. పిరికితనం.

టేబులు లైటు వేసి కుర్చీ లాక్కుని బల్ల ముందు కూర్చున్నాను. ఒక్కసారిగా కూర్చునే సరికి డయాఫ్రం గుండెను పైకి తన్నినట్లనిపించింది. ఊపిరి భారంగా తీసుకోవలసివచ్చింది. రాజు రాసిన కార్డు బల్ల మీదే ఉంది. అప్పటికి దాన్ని నాలుగయిదు సార్లు చదివి ఉంటాను. నా చేతిలోకి తీసుకున్నాను. "ప్రసాదూ, నీ దగ్గరనుండి బొత్తిగా ఉత్తరాలు రావటం లేదు. కారణం తెలియటంలేదు. నీ ఆరోగ్యం బాగానే ఉందని అనుకుంటున్నాను. బాగాలేకపోతే నీ సహాయానికి నీ దగ్గరకు రమ్మంటే వస్తాను. రాత్రి నాకోకల వచ్చింది. ఆ కల వచ్చి ఉండక పోతే ఈ ఉత్తరం రాసి ఉండే వాడిని కాదు. నా మటుకు నాకు భయంకరమయిన కలలానే ఉంది. అందులో....." తర్వాతది చదవ బుద్ధి కాలేదు. నాకు కలల మీద నమ్మకంలేదు. సెంటిమెంట్స్ లేవు. హృదయంలేదు. జరిగేదో జరుగుతుంది. అంతే. కార్డు చించి ముక్కలు చేసి కిటికీలోంచి బయటకు విసిరాను. గాలికి చాలా ముక్కలు తిరిగి గదిలోకి వచ్చి చిందర వందరగా పడ్డాయి. రాజు అభిమానంతో రాసిన ఉత్తరాన్ని చించినందుకు నా మీద నాకే కోపం వచ్చింది. తను చెప్పవలసిందేదో రాశాడు.

లైటు ఆర్పి మంచం మీద పడుకో బోతూ దిండు పక్కకు లాగేసరికి మల్లెల వాసన గుప్పుమని మంచం చుట్టూ కదిలింది. రాణి పెట్టినట్లుంది. రాణి నా గదికి వచ్చినప్పుడల్లా ఏదో ఒహటి మర్చిపోయి వెళ్లిపోతుంది. ఒకసారి మంగళసూత్రం మర్చిపోయింది. మెడలోంచి తీయకపోతే నష్టం ఏవిటో? రాణి, కమల కన్నా అందంగా ఉంటుందని కాదుగాని ఇద్దరికీ ఏ విషయంలోను పోలికలు లేవు. వాడిపోయిన పూల చెండును కిటికీలోంచి బయట పడేలా విసిరి మంచం మీద కూర్చున్నాను. పడుకుంటే గుండెనొప్పి అధికమవుతోంది.

రాణి మా ఇల్లుగలాయన కూతురు. పెళ్లి అయింది. ఒక పాప ఉంది. రాణి భర్త నాకంటే అందంగా ఉంటాడు. నాతో ఎంతో మర్యాదగా మాట్లాడుతుంటాడు. సెంటరులో బట్టల షాపు ఉంది. షాపు సరిగా నడుస్తున్నట్టులేదు. రాణి మధ్యాహ్నం నా గదికి వచ్చింది. ఆమెకు ఉన్నంత ధైర్యం నాకు లేదు. ఇంట్లో ఎక్కడికి వెళ్తున్నానని చెప్పి వస్తుందో నాకు అర్థం కాదు. బయట అటూఇటూ చూసి తలుపు మూసి గడియపెట్టి, నా దగ్గరకు వస్తూ "ఒంట్లో ఎలా ఉందోయ్" అడిగింది. రాణి నన్ను తన భర్తను

పిలిచినట్లు సంభోదిస్తుంటుంది. అలా పిలిచినప్పుడల్లా నాకు నవ్వొస్తుంటుంది. ఈసారి నీరసంతో నవ్వటానికి కూడా సత్తువ రాలేదు. రాణిలో నాకు నచ్చే అంశం కళ్లకు అందంగా కాటుకు పెట్టుకుంటుంది. ఆ గుండ్రటి కళ్లు మరింత అందంగా ఉన్నట్లనిపిస్తాయి. పచ్చటి నుదుటి మీద ఎర్రటి తిలకం నాకు చాలా ఇష్టంగా ఉంటుంది. తదేకంగా చూడబుద్ధి వేస్తుంటుంది. నల్లంచు తెల్లచీర కట్టుకుంది. నల్లటి పూల రవిక తొడుక్కుంది.

తెల్ల చీరలంటే కమలకు ఇష్టంలేదు. తనకు ఇష్టమున్నవి నాకు నచ్చేవి కావు. నాకు నచ్చనివి నచ్చలేదని నేను కమలతో ఎప్పుడూ అనలేదు.

రాణి మంచానికి ఆనుకని ముందుకు వంగి "ఒంట్లో ఎలా ఉందంటే మాట్లాడవేమోయ్" అని నా చేయి పట్టుకుని, "జ్వరం లేదు కదా, అటు జరుగు" అంది.

జరిగి చోటిచ్చాను. కూర్చుని నా మీదకు వాలుతుంటే ముందుకొచ్చిన జడలోంచి పూలచెండు జారి నా మీద పడింది. రవిక కింద బాడీ లేదు. "జ్వరం తగ్గింది. గుండెనొప్పి తగ్గలేదు." అన్నాను.

"డాక్టరు దగ్గిరకు వెళ్లకూడదూ?"

"వెళ్లాను. మందులు రాసిచ్చాడు. మళ్లీ ఈ సాయంత్రం రమ్మన్నాడు. మందులు వాడినంతసేపు బాగానే ఉంటుంది. తిరిగి మొదలువుతోంది. గుండె నిక్షేపంగా ఉంది. భయపడవలసిన అవసరం లేదు......" రాణి నా మాటలు వింటున్నట్లు లేదు. దిండు తన వైపు లాక్కుని నా పక్కనే పడుకుని నన్ను తనకు అభిముఖంగా తిప్పుకుంది.

కమలను నేను బతికించుకునే వాడినే. కాని?

రాణి తన పాదాలను నా కాళ్లమీద వేసి కదుపుతూ నా పెదాల మీద ముద్దుపెట్టుకుని, "సిగరెట్ వాసన, ఆ పాడు సిగరెట్లు తాగకపోతేనేం, మానేసి చావకూడదూ? ఒకసారి అద్దంలో చూసుకో. ఈ మూడు రోజుల్లో నీ ముఖం ఎలా పీక్కుపోయిందో....."అని కంటి కాటుక చూపుడు వేలితో తీసి నా ముక్కుకు రాసి, "నాకోసం ఎన్నిసార్లు ఆఫీసు ఎగ్గొట్టి ఉంటావు?" అని మరింత దగ్గరగా జరిగింది. ఆమెతో కొద్దిసేపు మాట్లాడితే మనసు తేలికవుతుంది. ఆమె ఎంతసేపు మాట్లాడినా వినబుద్ధి అవుతుంది. మూడ్‌లో ఊపిరాడనీయదు. మామూలప్పుడయితే నాకు ఇబ్బంది అనిపించదు.

"గుర్తులేదు" అన్నాను. నా సెలవులు చాలా మటుకు ఆమె కోసం ఖర్చు అయిన మాట నిజం. నా చొక్కా గుండీలు ఒక్కొక్కటే తీస్తోంటే ఆమె చేతిమీద నా చేయి పెట్టి ఆపి, "ఒద్దు" అన్నాను.

ఎందుకన్నట్లు చూసింది.

"నీతో అబద్ధం చెప్పటంలేదు. నాకేం బావోలేదు. ఇవేళ కాదు......."

ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకునేందుకు రాణి ప్రయత్నించదు. తను అనుకున్నది జరగాల్సిందే. కోపం వచ్చింది. చటుక్కున లేచి మంచం దిగి చీర సవరించుకుంటూ, "మళ్లీ నీ దగ్గరికు వస్తే అప్పుడను" అని బల్ల మీదున్న పుస్తకం అందుకుని నా మీదకు విసిరింది. పుస్తకం నాకు తగలకుండా తప్పుకున్నాను. రుసరుసలాడుతూ రాణి వెళ్లిపోయింది. ఆమె ఎప్పటికీ రావలసిన అవసరం ఉండదేమో? రేపటికి నేను ఉండకపోవచ్చు.

కళ్లల్లోకి నిద్ర కూరుకువస్తోంటే కళ్లు మూసుకున్నాను. అందినంత మేర దుప్పటి లాక్కుని కప్పుకుని నిద్రలోకి జారిపోయాను.

ఎంతసేపు నిద్రపోయి ఉంటానో తెలియదు. ఎవరో నన్ను తట్టి లేపుతుంటే మెలకువ వచ్చింది.కళ్లు తెరవబుద్ధి కావటంలేదు. నా చేవిలో గుసగుసల్లాటి మాటలు వినిపిస్తున్నాయి. మాటలు స్పష్టంగా లేవు. గొంతు గుర్తు పట్టగలను. చటుక్కున కళ్లు తెరిచాను. ఎవరూ లేరు. మాటలు వినిపించటం ఆగిపోయాయి.

కిటికీలోంచి చల్లటి గాలి వీస్తున్నా నాకు చెమట పడుతోంది. ఎవరో గుండెల మీద కూర్చున్నంత బరువు, బాధ, ఏదో ఘోష నన్ను గదిలోనే ఈడ్చుకు పోతోంది. గదిలోని లైటు నల్లగా వెలుగుతోంది. గది గోడలు నల్లగా ఉన్నాయి. కిటికీ అటుఇటూ ఊగుతోంది. మనసు ఆవిరయి గాలిలో తేలిపోసాగింది. రక్తం గుండెలో గడ్డకట్టినపోటు. కళ్లు మూతలు పడ్డాయి. కలలు నిజం కావు. అది కల ఎంతమాత్రం కాదు. కమల తన రెండు చేతులు నావైపు చాచి నవ్వుతోంది. చేతులకు పసుపు రంగు గాజులు ఉన్నాయి. నుదుటి మీద ఎర్రటి పెద్ద బొట్టు ఉంది. కాని .........ఆమె కట్టుకున్న చీర తెల్లగా ఉంది.

◆ లత మాసపత్రిక, జూలై 1967